

# పుణ్యతిథి

"వాయసేభ్యో బలినే దదామి!"

ఖంగుమంది పావని శాస్త్రి గారి గొంతు!పితృదేవతలకు పెట్టిన ప్రసాదాన్ని మూడు ఉండలుగా చేసి విస్తరిలో పెట్టి భక్తిగా తీసుకొచ్చి వాకిట్లో పెట్టాడు కర్త.

ఆ తర్వాత ఆరాటంగా ఆకాశం వైపు చూశాడు శాస్త్రిగారి తల కూడా అప్రయత్నంగా అటువైపు తిరిగింది ఆయతో బాటు మిగతా అందరి చూపులూనూ!

ఏ క్షణంలో నైనా వర్షించడానికి సిద్ధంగా దట్టంగా మబ్బులు పట్టి ఉంది ఆకాశం రాక్షసుల్లాంటి మేఘాల్ని చూసి భయపడి ఎక్కడెక్కడో చెట్ల చాటున దాగొన్నాయి పక్షులు

మబ్బులు పట్టిన ఆకాశం క్రింద ఒకే ఒక్క నిమిషం ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు నిశ్చలంగా కూర్చొందా నిండు విస్తరి.

ఆ తర్వాత వినిపించిందో కాకి రెక్కల చప్పుడు .

ఆ తర్వాత మరోటి . ఆపై ఇంకోటి ఇంకోటి . ఇంకోటి. పది పదిహేను కాకులు రెక్కలు తపతప లాడిస్తూ . గోల గోలగా అరుస్తూ... ఒకదాన్నొకటి ముక్కుతో పొడుచుకొంటూ

సరిగ్గా మూడు నిమిషాలలో విస్తరి ఖాళీ అయింది.

ఎంత హటాత్తుగా వచ్చాయో అంత హటాత్తుగానూ కాకులన్నీ ఎక్కడో చెట్ల గుబుర్లలో ఉన్న గూళ్లలోకి ఎగిరి పోయాయి

ఆబ్దిక కర్త కళ్ళు సంతృప్తితో మెరిశాయి చూస్తున్న వాళ్ళందరూ నిశ్చింతగా నిట్టూర్చి వెనక్కు తిరిగారు.

శాస్త్రిగారి కంఠం నించి కూడా ఓ దీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది కాని అందులో ఉన్నది మాత్రం దీర్ఘకాల వేదన ..

ఆ నిట్టూర్పుకి కదిలిపోయినట్లు రెప రెపలాడింది కిందనున్న విస్తరి

* * * * *

చిరు చీకట్లు ముసురు కొంటున్నాయి పెచ్చులూడి పోయిన వీదరుగు మీద, ఏ క్షణంలో నైనా విరిగి పోడానికి సిద్ధంగా ఉన్న స్థంభానికి తలాన్చి నిస్త్రాణగా కూర్చొనున్నారు పావని శాస్త్రిగారు పడమటి ఆకాశంలో శుక్రగ్రహం ధగధగ లాడుతోంది ఆయన కళ్ళు ఆ వేగుచుక్కను చూస్తున్నా మనస్సు మాత్రం మధ్యాహ్నపు దృశ్యాన్నే నెమరు వేసుకొంటోంది

తప తప లాడుతున్న కాకుల రెక్కల చప్పుడు నిమిషంలో ఖాళీ అయిన విస్తరి. కర్త ముఖంలో ఎనలేని సంతృప్తి .

ఇన్నేళ్ళలో తండ్రి పోయిన ఈ ఇరవై ఏళ్ళలో ఒక్క రోజు కూడా తానలా సంతృప్తిగా నిట్టూర్చలేదు!

ఎందరిళ్ళలోనో తను తరచు చూసే దృశ్యం ఒక్క రోజు కూడా తాను తనింట్లో చూడలేదు!

మనస్సులోని ఆవేదనను అణచి వేయడానికా అన్నట్లు ముఖాన్ని పట్టిన చెమటను ఉత్తరీయంతో తుడుచుకొన్నారు శాస్త్రి గారు

"చీకటి పడిపోయింది ఫలహారం చేయరూ?" గుమ్మంలో కొచ్చి పిల్చింది అన్నపూర్ణమ్మ వెలిసిన గుంటూరు నేత చీర కొంగు భుజం చుట్టూ కప్పుకొని . రూపాయి కాసంత కుంకం బొట్టు చెమటకు కాస్త చెదిరిపోగా వెండి తీగల్లా నెరిసిన జుత్తుని జారుముడిలో బంధించి కాశీ అన్నపూర్ణేశ్వరికి బీదవేషం వేసినట్లుందావిడ

మౌనంగా పెరట్లోకి నడిచి కాళ్ళు, చేతులు కడుక్కొని వంటింట్లోకి నడిచారు శాస్త్రిగారు అ సరికే అక్కడ రెండు పీటలు వేసి పళ్ళేలు పెట్టి, గ్లాసుల నిండుగా నీళ్ళతో అన్నీ సిద్ధంగా ఉన్నాయి

ఓ పళ్ళెం ముందు శాస్త్రిగారి ఇరవై ఏళ్ళ కొడుకు సుబ్రమణ్యం కూర్చొనున్నాడు

ఇవాళ అలా ఉన్నారేం నాన్నా? పీట మీద కూర్చుంటున్న తండ్రి మొహం వైపు పరీక్షగా చూస్తూ అడిగాడు సుబ్రమణ్యం

ఇవాళ సుబ్బరామయ్య గారింట్లో ఆబ్దికం జరిపించి వస్తున్నారు భర్తకు బదులు సమాధానం ఇచ్చింది అన్నపూర్ణమ్మ అర్థమైందన్నట్లు తల్లివైపు చూశాడు సుబ్రమణ్యం

మధ్యాహ్నం భర్త వస్తూ వస్తూ తనతో తెచ్చిన సంచిని విప్పి ఇద్దరి పళ్ళేలలోనూ- గారెలు, పూరీలు, నువ్వులు ఉండలు వడ్డించింది పర్విందచి ఉపక్రమించారిద్దరూ .

' గారె ఒక్క ముక్క కొరగ్గానే సుబ్రమణ్యం కళ్ళు మెరిశాయి

'అరే అమ్మా ఇవి నేతిగారెలు ఎంత రుచిగా ఉన్నాయో! మరింక అన్నం పెట్టకు ఇవున్నాయిగా చాలు ఉత్సాహంగా అన్నాడు సుబ్రమణ్యం

భర్త మొహం వైపు ఓరగా చూసింది అన్నపూర్ణ అప్పటికే అది మ్లానమై పోయిఉంది ఆయన చేతిలో ఉన్న గారెముక్క అప్రయత్నంగా పళ్ళెంలోకి జారిపోయింది

నోట్లో వేసుకొన్న ముక్క ఇనప ముక్కగా మారిపోయినట్లనిపించి అతికష్టం మీద దానిని గబగబ నమిలి మింగేసి గ్లాసెత్తి నీళ్ళన్నీ గటగటా తాగేసి పీట మీంచి లేచిపోయి గబగబా పెరట్లోకి నడిచారు

ప్రశ్నార్థకంగా తల్లి వైపు చూశాడు సుబ్రమణ్యం

మీ తాతగారికి నేతిగారెలంటే ప్రాణం బాబూ! అవి తిన్నప్పుడల్లా అచ్చు ఇలాగే మాట్లాడే వారట! బహుశః అది గుర్తొచ్చి ఉంటుంది ' బాధగా అంది అన్నపూర్ణమ్మ తండ్రి అలా లేచిపోగానే మౌనంగా అన్నాన్ని అటు, ఇటు కెలుకుతూ కూర్చొన్నాడు సుబ్రమణ్యం

'అమ్మా తాతగారి ఆబ్దికం ఇంక రెండు నెలలే ఉంది కదా! ఇప్పటికి ఎంత డబ్బు కూడిందమ్మా?"



అవధానుల విజయలక్ష్మి

సాయంత్రం డబ్బా తీసి డబ్బు లెక్క పెట్టారుగా' ఏడువందల రూపాయల చిల్లరుంది ఇంకా కనీసం మూడు వందలైనా కావాలట'

అమ్మా నాన్నగారికి నే చెప్తా కాని నువ్వు చెప్పమ్మా బెంగపడొద్దని' ఇప్పుడు మరో రెండు కొత్త ట్యూషన్లు పట్టానుగా వాళ్ళను కూడా ఎడ్వాన్సు అడుగు తాలే' నేను పద్యాలు రాసే శెట్టిగారు కూడా నేను ప్రాధేయపడితే కాస్తో కూస్తో సర్దక పోరు

నాన్నారితో అలాగే చెప్తాలే ఏమిటో సాయింత్రం నించి ఒకటే దిగులుగా ఉన్నారు పది నెలలు పైసాపైసా కూడబెడితే ఈ నాటికి ఏడు వందలయ్యింది మిగతా మూడు వందలూ ఈ రెండు నెలల్లో సంపాదించ గలమా – అని

"నే చెప్తున్నాగా వెయ్యిరూపాయలూ పూర్తి చేసే బాధ్యత నాదేనని' ఈసారైనా నాన్నగారు ఎప్పటి నుండో అనుకుంటున్నట్టు గోదానం, భూదాన, స్వర్ణ దానాలతో తాతగారి అబ్దికాన్ని జరిపించాలి' పట్టు దలగా అన్నాడు సుబ్రమణ్యం

మూడు నిమిషాలు మౌనంగా గడిచాయి

"అమ్మా నేనొక్కటడుగుతాను చెప్తావా? నాన్న ఎప్పుడూ బాధ పడుతూ ఉంటారు నేతి గారెల్తో, నాలుగేసి కూరలు, పచ్చళ్ళు, పిండి వంటల్తో నలుగురు బ్రాహ్మణులకి సంతృప్తిగా భోజనం పెట్టక పోడం వల్లనే తాతగారి ఆత్మ అసంతృప్తి చెందుతోందని అమ్మా ఎప్పుడో పరమాత్మలో ఏకమై పోయిన ఈ జీవాత్మకు ఇంకా ఈ జిహ్వా చాపల్యాలూ, కోరికలూ ఉంటాయమ్మా? అలా అయితే ఈ శరీరం పంచ భూతాల్లో కలిసిపోడం, జీవాత్మ, పరమాత్మలో ఏకమై పోడం, వీటన్నిటికీ అర్థమే లేదు కదమ్మా? అసలు మనిషి వృద్ధాప్యంలోకి ప్రవేశిస్తున్నప్పుడే వరసక్రమంలో తన డబ్బు – తన వారు తన శరీరం అన్న మమకారాల్ని వదిలేసుకొంటాడు కదా' ఇక పంచ భూతాల్లో కలిసిపోయిన శరీరానికి ఈ మమకారాలెక్కడివమ్మా?" ఎంతో కుతూహలంగా అడిగాడు సుబ్రమణ్యం

బాబూ మనిషి పరలోకానికి ప్రయాణం చేసిన రోజున ప్రతి సంవత్సరం దర్భల మీదికి పరలోకంలో ఉన్న ఆత్మ దేవతలను ఆహ్వానిస్తారు వారికి సమర్పించిన ప్రసాదాన్ని కాకులు పూర్తిగా అరగిస్తే వారి ఆత్మే ఆ కాకుల శరీరంలోకి ప్రవేశించిందనీ ఆ పూర్తిగా తినేయడమన్నది ఆ ఆత్మ పూర్తిగా సంతృప్తి చెందడాన్ని సూచిస్తుందనీ అనుకొంటారు బాబూ నేను మీ నాన్న గారిలా శాస్త్రాలు చదవలేదు అందుకే దీనిగురించి ఇంతకంటే వివరంగా చెప్పలేను నీలా ఈ కాలపు చదువులూ చదవలేదు అందుకే ఈ విషయం గురించి తార్కికంగానూ ఆలోచించలేదు' ఒక్కటి మాత్రం నిజం బాబూ' కనీసం ఆ రోజైనా పైలోకంలో ఉన్న వారి పేరు మీదుగా ఓ నల్గురు బ్రాహ్మణులు సంతృప్తిగా భోజనం చేస్తే అది మనకు మాత్రం తృప్తి కాదూ? ఆ భోజనం మనవాళ్ళే చేశారనుకొంటే మన అంతః ప్రవృత్తిగా సంతృప్తి కాదూ!"

"అవునమ్మా అందుకే డబ్బు సంపాదించే బాధ్యత నాదే నంటున్నాను పైలోకంలోని తాతగారి ఆత్మసంగతి ఎలా ఉన్నా ఈ లోకంలోని నాన్నగారి మనస్సు తృప్తి చెందడం నాక్కావలసింది!"

కొడుకు వైపు గర్వంగా చూసుకొంది అన్నపూర్ణమ్మ

★ ★ ★ ★ ★

పక్క మీద అసహనంగా కదిలారు పావని శాస్త్రిగారు అర్ధ రాత్రి దాటినా ఆయన్ని నిద్రాదేవి కరుణించలేదు.

అరే నేతిగారెలా' ఇవున్నాయిగా ఇక అన్నం పెట్టకు" కొడుకు గొంతు చెవిలో ప్రతి ధ్వనించింది

నాన్న నాన్న కూడా అచ్చు ఇలాగే అనేవారు నేతిగారెలు ఆయన కెంత ప్రాణమో'

తను బాగా చిన్నవాడుగా ఉన్నప్పుడు కనీసం నెలకోసారైనా ఇల్లంతా నేతి గారెల ఘుమఘుమల్తో నిండి పోయేది ఓ రోజు ముందుగానే హెచ్చరించేవారు నాన్న అమ్మని "ఇదిగో నిన్నే రేపు శనివారప్పలహారానికి గారెలు చేస్తున్నావుగా' చక్కగా పూసకట్టిన నేతితో దోరగా వేయించు ఆ వెధవ నూనెలు వాడకు తెలిసిందా?

ప్రతిసారీ చెప్పాలటండీ చిరుకోపంతో విసుక్కొనేది అమ్మ

ఓ అయిదేళ్ళు గిర్రున తిరిగే సరికి ఎప్పుడో ఏడాది కొక్కమారు తప్ప ఇంట్లో నేతిగారెల గుబాళింపు కనిపించేది కాదు ఆ తర్వాత తరువాత నాన్నగారు ఎప్పుడైనా నేతిగారెలు చేయమన్నా చేతి మీదికే లేదు ఇక నేతితో గారి లెలా చేస్తానండీ' కావాలంటే మంచి నూనెతో ఓ నాలుగు చేసి పెడతాను' అనేది అమ్మ అయిష్టంగా మొహంపెట్టేవారు నాన్న

మరో అయిదేళ్ళు గిర్రున తిరిగే సరికి ఆ నూనె గారెలూ లేవు' నాన్న ఎప్పుడైనా అడిగినా మినప్పప్పుధర ఎలా మండి పోతోందో తెలుసుకదండీ'

ఆ డబ్బు పెడితే మరో మూడు పూటలు కడుపు నిండా తినొచ్చు ఓ పది రోజులు పిల్లలకి కూరలు చేసిపెట్టొచ్చు" అనేది అమ్మ కాస్త విసుగ్గా

ఆ విసుగుదలలో భర్త కోరిన చిన్న కోరిక కూడా తీర్చలేక పోయానే అన్న వేదన కూడా మిళితమై ఉండేది అప్పటికి తన కర్థమయింది

ఒకప్పుడు నిత్యం పురాణ కాలక్షేపాలతోనో ఇంటికి వచ్చే చుట్టాలతోనో కళకళ్ళాడే వీధరుగు ఈ నాడు ఎందుకు బోసిపోయిందో

రోజూ ఎవరో ఒకరింటికి పెళ్ళికో, వ్రతానికో బాలసారెకో పిలుపు లొచ్చే నాన్నకు ఇప్పుడు ఏ రెండు నెలలకో ఒకసారి ఏ శ్రాద్ధకర్మలకో తప్ప పిలుపు లెందుకు రావడం లేదో .

అమ్మ మెడలో కాసుల పేరూ, పట్టెడ గొలుసూ చేతులకి ఆరేసి జతల బంగారు గాజుల స్థానాన్నే పసుపు తాడూ, మట్టి గాజులూ ఎందు కొచ్చాయో అన్నీ అర్థమయ్యాయి

మనుష్యులు పెరిగారు మనుష్యుల మధ్య దూరం పెరిగింది జీవితంలో వేగం పెరిగింది మనుష్యుల ఆలోచనలు పెరిగాయి ధరలు పెరిగాయి సంతానం పెరిగింది వీటన్నిటితో బాటు మనుష్యులలో ఆధ్యాత్మిక చింతన తగ్గింది

తను మెట్రిక్ పస్ట్ క్లాసులో పాసయిన రోజు నాన్న ఎంత పొంగి పోయారో ఇంకా చదివించుదామని ఎంత ఆశపడ్డారు! కాని చేతిలో డబ్బేది? అందుకే తనే నిష్కర్షగా చెప్పేశాడు ఇకపైకి చదవననీ టీచర్ ట్రయినింగ్ చేస్తాననీ తను ట్రయినింగు పూర్తి చేయడం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం జరిగే సరికి అమ్మ మంచం పట్టింది

తన మేనగోడలు ముచ్చటగా తనింట్లో తిరుగుతూ ఉంటే చూడాలన్న అమ్మ కోరికను కాదనలేక ఆర్ధికంగా పూర్తిగా స్థిరపడక ముందే అన్నపూర్ణను వివాహం చేసుకొన్నాడు తన ఆఖరి సంతానం పెళ్ళి కూడా కళ్ళార చూసిన అమ్మ సంతృప్తిగా కళ్ళుమూసింది

అక్కలూ, అన్నలూ అందరూ తలో ఊర్లోనూ స్థిరపడ పోగా స్వంత ఊర్లోనే ఉద్యోగం వచ్చిన తను నాన్నను తనతోనే ఉంచేసుకొన్నాడు

పదహారేళ్ళ అన్నపూర్ణ మామగార్ని తండ్రిలాగే చూసుకొనేది! మొదట్లో తనకొచ్చే జీతమూ అడపాదడపా చేసే పౌరోహిత్యమూ వీటితో తమ ముగ్గురికీ బాగానే జరిగి పోయేది

పదేళ్ళు గిర్రున తిరిగేసరికి తను ముగ్గురు ఆడపిల్లల తండ్రయ్యాడు ఎదుగుతున్న పిల్లలు ఖర్చులు వాళ్ళ చదువులు నాన్నకి మందులు వీటన్నిటికీ తోడు ఎప్పుడూ సక్రమంగా అందని జీతం

చాలీ చాలని బ్రతుకైపోయింది

నాల్గోసారి అన్నపూర్ణ కడుపుతో ఉన్నప్పుడు నాన్న ఆమె దగ్గరి కొచ్చి ఓ రెండు నేతిగారెలు చేసిపెట్టు తల్లీ ఎన్నాళ్ళయిందో తిని డాక్టర్లు చెప్పిన తిండి తిని, తిని ఈ మధ్య జిహ్వ చచ్చిపోయిందనుకో' అన్నపూర్ణ అరవై ఏళ్ళ

# పుణ్య తిథి

మామగారు ఆరేళ్ళ పసివాడిలా అడుగుతుంటే మనస్సు ద్రవించి పోయిన పూర్ణ ఓ పది రోజుల బాటు మజ్జిగ చిలికి చిలికి కాస్త కాస్త వెన్న తీసి జాగ్రత్తగా దాచి దాచి ఇంట్లో పోపులకని కొని ఉంచిన మినపప్పు ఓ పిడికెడు నానబోసి ఓ రోజు తెల్లవారు ఝామునే పిల్లలెవరూ లేవకముందే ఓ నాలుగు గారెలు చేసి మామగారి ముందు పెట్టింది స్నానం చేసి బగవద్గీత చదువుకొంటున్న ఆయనకళ్ళు ఆ పళ్ళేన్ని చూడగానే మెరిశాయి

"ఇంత పొద్దున్నే చేసేశావా తల్లీ! మీ అత్తగారు పోయాక ఇదేనమ్మా ఇలా నేతి ఘుమ ఘుమల్తో దోరగా వేగిన గారెల్ను చూడడం' అంటూ ఓ ముక్క తుంచి నోట్లో వేసుకొన్నారు సరిగ్గా ఆ క్షణంలోనే మృత్యు దేవత ఆయన గది తలుపుల్ని తట్టింది నోట్లో పెట్టుకొన్న గారెముక్క గొంతు దిగకుండానే ఓ దగ్గుతెర ఆయనుక్కిరి బిక్కిరి చేసింది అది పోతూ పోతూ తనతో బాటు ఆయన ప్రాణాల్ని కూడా తీసుకు పోయింది

నాన్న పోయేనాటికి చేతిలో చిల్లి గవ్వ లేదు! కర్మకాండలు క్లుప్తంగా జరిపించేశాడు ఆఖరి క్షణంలో నాన్న చేతిలోంచి జారిపోయిన పళ్ళాన్ని చూసినప్పుడల్లా మనస్సు కలిచి వేసినట్లయ్యేది

ఆ రోజు నిశ్చయించు కొన్నాడు పైసాపైసా కూడబెట్టి అయినా సరే నాన్న సంవత్సరీకాలు ఘనంగా జరిపించాలని

తనూ పూర్ణాకలిసి పావలాకంటే తక్కువున్న చిల్లర నాణేలన్నీ ఓ పాత డాల్డా డబ్బాలో వేసి దాచేవారు ఎన్ని ఖర్చులున్నా ఆ డబ్బాలోని డబ్బులు వాడేవారు కాదు నాన్న సంవత్సరీకాలకి డబ్బు సరిపోతుందని నిశ్చితంగా నిట్టూర్చేంతలో పసివాడు సుబ్రమణ్యానికి తీవ్రమైన జబ్బు చేసింది పచ్చ కామెర్లు పట్నం ఆస్పత్రిలో చేర్చాలన్నారు తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బాలోని డబ్బులు వాడేయవలసి వచ్చింది

ఆ సంవత్సరం శకట శ్రాద్ధంచేసి ఊరుకొన్నాడు

ప్రసాదాన్ని మూడు ఉండలుగాచేసి ఎంతో భక్తి శ్రద్ధలతో పెరటివాకిట్లో పెడితే ఎంత సేపో పిలవగా పిలవగా ఒకకాకి వచ్చి అలా అలా కెలికి ఎగిరిపోయింది

తన మనస్సే కెలినట్లయింది

మళ్ళా డబ్బాలో డబ్బులు వేయడం మొదలెట్టారు ఈసారి పెద్ద కూతురి పెళ్ళి

మూడోసారి రెండో కూతురి పెళ్ళి

నాల్గోసారి మూడో కూతురి పెళ్ళి అయిదోసారి అన్నపూర్ణ జబ్బు సంవత్సరమంతా నాన్న పుణ్య తిథికని దాచిన డబ్బులు ఆఖరి క్షణంలో ఖర్చయి పోతూనే ఉన్నాయి

తను యదావిధిగా చటకంతో సరిపుచ్చుతూనే ఉన్నాడు

విస్తరి ఖాళీ అవకుండానే ఒకటో రెండో కాకులు అల్లం, నిమ్మకాయ, పాలు, బెల్లం వేసిన ఆ అన్నాన్ని అటు ఇటు కెలికి ఎగిరిపోతూనే ఉన్నాయి

ఒకటి కాదు రెండుకాదు ఇరవై సంవత్సరాలనించి జరుగుతోందలా! నాన్న ఆత్మ ఎంత అసంతృప్తి చెందకపోతే కాకులు అన్నాన్ని అలా వదిలేస్తాయి?

అందుకే ఈసారైనా తప్పక నేతి గారెల్తో, నాలుగు కూరలు, పచ్చళ్ళు పిండి వంటల్తో నలుగురికి సంతృప్తిగా బోజనం పెట్టాలి! గోదాన, భూదానం, స్వర్ణదానం చెయ్యాలి!

అప్పటిక్కాని నాన్న ఆత్మ సంతృప్తి చెందదు!

అప్పటిక్కాని వాకిట వేసిన విస్తరిని కాకులు ఖాళీ చెయ్యవు

కూతుర్ల పెళ్ళిళ్ళన్నీ చేసేశాడు త్వరలో పురుళ్ళూ, పుణ్యాలు లేవు

ఇకపోతే సుబ్రమణ్యం కూడా నాలుగు రాళ్ళు సంపాదిస్తున్నాడు

వాడికి తనపోలికే వచ్చింది "ఇంటర్ ఫస్ట్ క్లాసులో పాసయ్యావు ఎలాగోలా కష్టపడి చదివిస్తాను కనీసం డిగ్రీ వరకైనా చదవరా అంటే ససేమిరా కాదన్నాడు


'డిగ్రీ కాదుకదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినా మనలాంటి వాళ్ళకి ఉద్యోగం వెంటనే ఎలాగూ దొరకదు అంతకంటే చిన్న చిన్న పార్ట్‌టైం పనులు చేసుకొంటూ, టైపు, షార్టుహేండులు నేర్చుకొంటూ బాంకు పరీక్షలకి కడుతూ ఉంటే త్వరలోనే నా కాళ్ళమీద నేను నిలబడగలను అంటూ తన ప్రతిపాదనని తోసిపుచ్చాడు

అందుకే ఈ కాస్త డబ్బయినా సమకూడింది!

దాచినా దాగని సంతృప్తి పావని శాస్త్రిగారి ముఖంలో తాండవిస్తోంది రేపే తండ్రి పుణ్యతిథి

ఎన్నాళ్ళకి ఎన్నేళ్ళకి తనకోరిక తీరబోతోంది!

ఇరవై ఏళ్ళ తర్వాత ఈనాటికి డబ్బాలో దాచిన డబ్బులు ఖర్చవకుండా మిగిలాయి! పుణ్య తిథికి కాలసిన ఏర్పాట్లన్నీ చేసేశాడు ఇక అందరికీ డబ్బు తీయడమే తరువాయి! వీధరుగు మీద కూర్చొని సంతృప్తిగా కళ్ళు మూసుకున్నారు



"గోరం జరిగిపోనాది పంతులు గోరూ గోరం!

ఉలిక్కిపడి కళ్ళు తెరిచారు ఎదురుగా అప్పిగాడు!

మొలచుట్టూ మూరెడు పొడుగున్న గోచీగుడ్డ దానిమీద నిండా చిల్లులతో మాసిన బనీను న్యూనెలేక పీచులా రేగిన తల ఏడ్చినట్లు ఉబ్బి ఉన్నకళ్ళు

ఏమయిందిరా? అలా ఉన్నావేం ఆందోళనగా అడిగారు శాస్త్రిగారు

తన చిన్నతనంలో తాము బాగా బతికే రోజుల్లో ఈ అప్పిగాడు తనతోటివాడు ఇంట్లోనూ తమకుండే కాస్తంత పొలంలోనూ చిన్న చిన్న పనులు చేసే వాడు కడుపునిండా తిండీ ఒంటినిండా బట్టా ఇస్తే చాలు ఒక్కపైసా అడిగేవాడు కాదు కుర్రాడని నాన్నే అడపా దడపా డబ్బు లిచ్చేవారు వీలు చిక్కినప్పుడల్లా రెండు అక్షరం ముక్కలు తను చెప్పేవాడు కాలక్రమాన భూములన్నీ పోయాయి ఇక పొలం పనులేముంటాయి? ఇంట్లో కావలసినంత పని కాని తినే మనిషి మరొక్కరు ఎక్కువైనా భారమయ్యే పరిస్థితి అప్పటికి అప్పిగాడూ పెద్ద వాడయ్యాడు ఓ రిక్షా తొక్కుతూ పొట్టపోసుకోడం మొదలెట్టాడు

తమింట్లో పని మానేసినా అడపా దడపా వచ్చి పలకరించడం చిన్నా చితకా పనులు చేసి పెట్టడం మానలేదు ఇప్పుడు అప్పిగాడూ ముసలివాడైపోయాడు తండ్రి రిక్షా కొడుకు తీసుకొన్నాడు కొడుకు తెచ్చే కాసిని డబ్బులతో ఓ పూట తినీ ఓ పూట తినకా వాళ్ళ కుటుంబం అలా గడిచిపోతోంది

కనీసం రెండ్రోజుల కోసారైనా తన దగ్గరికొచ్చి కష్టం సుఖం చెప్పుకొంటాడు ఇప్పటికీ! సరిగ్గా రెండ్రోజుల క్రితమే వచ్చి వాళ్ళ ఆర్థిక ఇబ్బందుల గురించి ఏమిటేమిటో చెప్పాడు ఇంతలో ఏమైంది?

శాస్త్రిగారి ప్రశ్నతో అప్పిగాడినుండి రెండు నీటిబొట్లు జారిపడ్డాయి ఏం సెప్పను పంతులుగోరూ! నిన్న మాపటేల మావోడు ఆ డౌన్లో రిచ్చా తొక్కుకొత్తుంటే ఓ నారీ గుద్దేసింది రిచ్చాతోబాటు ఈడుకూడా అంతదూరం ఎగిరి పడ్డాడు తలకి బాగా దెబ్బతగిలింది బోలెడంత రగతం పోయింది రాత్రేళనించి ఒంటి మీద స్పృహ కూడా లేదు పంతులుగోరూ! మూడు సీసాల రగతం ఎక్కించాలట! ఏయో సిన్న సిన్న ఆప్రేసన్లు సెయ్యాలట! వెయ్యి రుపాలైనా అగతాదన్నారు. ఆస్పత్రోళ్ళు ఏ పూటకాపూట తిండికి డబ్బు లెతుక్కొనే వోళ్ళం వెయ్యి రూపాలెక్కడ్నించి తేను పంతులుగోరూ మూడు నాలుగ్గంటల్లో ఆ రగతం ఎక్కించి ఆప్రేసన్లు చేయకపోతే నాబిడ్డ నాకు దక్కడంట పంతులుగోరూ!' చెపుతూనే బావురుమన్నాడు శాస్త్రిగారి గుండె దడదడలాడింది చేయి అప్రయత్నంగా మొలలో దోపుకున్న తాళం చెవుల గుత్తిమీదికి వెళ్ళింది

సరిగా గంటక్రితమే మరోసారి డబ్బంతా లెక్కపెట్టుకొని డాల్డాడబ్బాని పెట్లో పెట్టి తాళం వేశారు శాస్త్రిగారు

నాన్న పుణ్య తిదికి వందురోజు దాకా చేతిలో డబ్బులుండడం ఇదే మొదటిసారి! ఆఖరిక్షణంలో చేతిలోని అవకాశం జారిపోబోతోందా?

ఈ వెయ్యి రూపాయలతో ఎక్కడో పైలోకాల్లో ఉన్న ఆత్మకు సంతృప్తి కలుగుతుంది ఈవెయ్యి రూపాయలతో నేడో జీవితం నిలబడుతుంది!

మొదటిది నమ్మకం రెండవది వాస్తవం

## కన్నీటిపై కసి

"చీటికీ మాటికీ కన్నీరు పెట్టుకుంటూ
సానుభూతిని మనస్సుకి కట్టుకుంటూ
మాటలాడటం నాకు చేతకాదు"
చేత నవడానికేముంది?
సాధన చేస్తే అదే వస్తుంది!
కానీ నటించడం నాకిష్టంలేదు!"
'అసలు నేను కన్నీటికే వ్యతిరేకం
కష్టం పంజావిప్పి మీద పడుతున్నపుడు
బాధ బాంబై పగిలి నిప్పులుముస్తున్నప్పుడు
ఎవడైతే ఏడుస్తాడో వాడి ఏడుపుని ద్వేషిస్తాను!
వాడి కన్నీటిని ద్వేషిస్తాను!

—డాక్టర్ మిరియాల రామకృష్ణ






బాలరంజని మార్చి,1987 సంచిక వెలువడింది!



ఈ సంచికలో 9 కథలు, 4 సీరియల్ కథలు, 1 పెద్ద కథ, 4 వ్యాసాలు, బొమ్మల కథ, ఇంకా.. బోలెడన్ని కార్టూన్లు, వింతలు-విచిత్రాలు, గమ్మత్తులు... ఎన్నో వున్నాయి.
చూస్తే మీకే తెలుస్తుంది.

# ఇ·వేమన·పద్యాలు




యవ్వన మనగా నేమియొ
యవ్వగ కౌమార మనగ నదియును నెట్లో
దవ్వగు వార్ధక్యములో
చివ్వగనీ మదిని జింత చేయుర వేమా.

కాని కాని అన్ని ఏర్పాట్లూ చేసుకొని ఆఖరి క్షణంలో మానేస్తే అసలే ఇన్నాళ్ళూ అసంతృప్తితో అల్లాడుతున్న ఆత్మ మరింత అసంతృప్తి చెందిపోదూ? ఈ వెయ్యి రూపాయలూ ఇప్పుడిచ్చేస్తే గోదానం, స్వర్ణ దానం మాటటుంచి కనీసం నేతిగారెల్తో భోజనం కూడా పెట్టలేదు'

తాను ఎన్నిసార్లో భగవద్గీతలో చదివిన శ్లోకం గుర్తొచ్చింది శాస్త్రిగారికి

## పుణ్య తిథి

'వాసాంసి జీర్ణాని యధా విహాయ
నవాని గృహ్ణాతి నర అప్రాణి'
తథా శరీరాణి విహాయ జీర్ణాని
అన్యాని సమ్యతి నవాని దేహీ''

జీర్ణమైన దుస్తులను విడిచి మనిషి కొత్త దుస్తులు వేసుకొన్నట్లే జీర్ణమయిన శరీరాన్ని విడిచి ఆత్మ కొత్త శరీరాన్ని ధరిస్తుందట'

ఎప్పుడో ఇరవై ఏళ్లక్రితం పైలోకానికి ప్రయాణించిన ఆత్మ ఇంకా కొత్త శరీరాన్ని వరించకుండా ఉంటుందా?

ఈ ఇరవై ఏళ్లలో ఎంతో జీవితాన్ని అనుబవించకుండా ఉండి ఉంటుందా? అలాకాక ఏ శరిరాన్నీ ధరించకుండానే అశాంతిగా పైలోకంలో తిరుగుతోందా?

పైలోకంలో ఉన్న తండ్రిని సంతోషపెట్టడమా?

ఈ లోకంలో ఉన్న అప్పగాడి కొడుకుని బతికించడమా?

ఒకే ఒక్క నిమిషం కళ్ళు మూసుకొని అలా కూర్చుండి పోయారు శాస్త్రిగారు ఆ తర్వాత చటుక్కున లేచి గబగబా లోపలికి నడిచి పెట్టెమూత తీసి అందులోంచి డబ్బాని ఎయటకు తీసి వీధిలో కొచ్చి అక్కడ దీనంగా నిల్చొన్న అప్పగాడి చేతిలో ఆ డబ్బాను పెట్టారు

అప్పగా చూడు ఇందులో వెయ్యి రూపాయలున్నాయి అంతా చిల్లరే ఇంకా నోట్లుగా మార్చలేదు నువ్వు ముందు త్వరగా ఆస్పత్రికి పద నీ వెనకే నేనొస్తాను ఊ పదమరి ఆలస్యం చేస్తే అవతల ప్రాణానికే ముప్పు

* * * * * *

మర్నాడు

అంతా మళ్లా మామూలే ఇరవై సంవత్సరాలుగా జరుగుతున్న తంతే' నలుగురు బ్రాహ్మలు తీరు గోదానాలు, భూదానాలు లేవు నాలుగు రకాల కూరలు పచ్చళ్ళు పిండివంటలు అసలు లేవు

ఎంతో మనస్సుపడి చేయించుకొని ఆఖరి క్షణంలో చేతిలోంచి జారిపోయిన నేతిగారెలూ లేవు.

యుదావిధిగా అన్నంలో నిమ్మకాయ, పాలు, పంచదార, అల్లం అన్నీ వేసి... ప్రసాదాన్ని మూడు ఉండలుగా చేసి విస్తరిని వాకిట్లో ఉంచారు శాస్త్రిగారు

ఎప్పుడూ వచ్చే ఒక కాకి కూడా రాదు కాబోలు! నీరసంగా అనుకొన్నారు శాస్త్రిగారు

ఆయన ఊహను అబద్ధం చేస్తూ దూరంగా ఉన్న చెట్టు మీదనించి తప తప రెక్కలు చప్పుడు చేస్తూ ఒక కాకి వచ్చి వాలింది ఆ తర్వాత ఇంకోటి ఆపై మరోటి మరోటి గోలగోలగా అరుస్తూ రెక్కలు తప తప లాడిస్తూ ఒకదాన్నొకటి ముక్కుతో పొడుచుకొంటూ.

తనకు చిరపరిచితమైన దృశ్యం'

కాని తనింట్లో మొదటిసారి చూస్తున్న దృశ్యం'

కళ్ళు విప్పార్చుకు చూస్తుండిపోయారు శాస్త్రిగారు

సరిగ్గా మూడు నిమిషాలకు విస్తరి ఖాళీ అయిపోయింది ఒక్క మెతుకైనా మిగలకుండా

సుబ్రహ్మణ్యం తల్లివైపు చూశాడు.. అన్నపూర్ణమ్మ శాస్త్రిగారి వైపు చూసింది

"ఇవాళ నిజంగా పుణ్య తిథే!" అన్నారు శాస్త్రిగారు సంతృప్తిగా తల్లీ కొడుకుల పెదవులమీద చిరునవ్వు లాసన్నం చేసింది □